సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 23 । జూన్ । 2023



పెళ్లి వద్దు.. చదువే ముద్దు
బాల్య వివాహాలను ప్రభుత్వం కట్టడి చేస్తోంది. ఆడ పిల్లలను చదివించి, భవితకు బంగారు బాటలు వేసేలా తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగిస్తోంది. - 8లో



బీసీలను విస్మరించిన పార్టీలకు..
బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం తప్పదని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ స్పష్టం చేశారు. - 8లో



హాట్ మిక్స్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం
కొత్తవలస మండలం గులివిందాడ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన హాట్‌మిక్స్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. - 8లో

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన చకచకా ఏర్పాట్లు



వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, కలెక్టర్లు

కురుపాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 28న కురుపాం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో ఇప్పటికే దాసరిపేట దగ్గర ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో సభా స్థలాన్ని సిద్ధంచేశారు. వాహనాలకు పార్కింగ్, హెలిప్యాడ్ స్థలాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కలెక్టర్ నిషాంత్ కుమార్ గురువారం పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ హేమలత, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ,కురుపాం, ఎల్విన్‌పేట, నీలకంఠాపురం ఎస్ఐలు, ఆర్ అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

బల్లుకోట రోడ్డు పనులు పరిశీలన



బల్లుకోట గిరిజన గ్రామ రోడ్డు పనులు పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్న పీఓ విష్ణుచరణ్

కురుపాం: మండలంలోని గొటివాడ పంచాయతీ బల్లుకోట గిరిజన గ్రామ రోడ్డు పనులను ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ గురువారం పరిశీలించారు. జాతీయ ఉపాధి హామీపథకం నిధులు రూ.కోటి79 లక్షలతో మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులకు కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి రెండు రోజుల కిందట శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్డు పనుల తీరును పీఓ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామస్తులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం కురుపాం ఆదర్శ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఆయన వెంట ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారి జె.శాంతీశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

షేర్‌హోల్డర్లు సద్వినియోగం చేసుకోవాలి



ఉప కమిషనర్, పాలకొండ లిక్విడేటర్ సత్యనారాయణ

పాలకొండ రూరల్: సహకారం రంగం ద్వారా చక్కెర కర్మాగారం ఏర్పాటుకు 1980వ దశకంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లా పరిధిలో 17 మండలాలకు చెందిన 15,999 రైతుల నుంచి రూ.16 లక్షల మూలధనం సేకరించారు. అప్పట్లో కర్మాగార నిర్మాణం కార్యరూపం దాల్చకపోవడంతో షేర్ల నిధులు సహకారం రంగం పరిధిలో నిలిచిపోయాయి. ఆ మొత్తం ఎఫ్‌డీ రూపంలో ఆరున్నర రెట్లు వృద్ధి చెంది నేడు రూ.కోటి 5 లక్షలకు చేరింది. ఈ మొత్తాలను నాడు షేర్లు కొనుగోలు చేసిన వారికి చెల్లించదలచినట్లు బొబ్బిలి చెరకు ఉప కమిషనర్, పాలకొండ లిక్విడేటర్ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం పాలకొండ నక్కలపేట షిర్డీసాయి మందిర సమీపంలో గల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు 711 మంది రైతులకు అప్పట్లో కొనుగోలుచేసిన షేర్ల ప్రాప్తికి పెరిగిన మొత్తంతో కలిపి రూ.4లక్షల 59 వేలు అందించామన్నారు. మిగిలిన షేరుహోల్డర్లు ఈ విషయం గుర్తించి స్థానిక కార్యాలయంలో నాటి రసీదులు తీసుకువచ్చి సమర్పిస్తే నేటికి వృద్ధి చెందిన షేర్ మొత్తాలు చెల్లిస్తామన్నారు. వారసులు ఉంటే షేర్ హోల్డర్ మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ సభ్యుల అంగీకార పత్రాలు సమర్పిస్తే షేర్ మొత్తం చెల్లిస్తామని స్పష్టం చేశారు.

గదబవలస పరిసరాల్లో గజరాజులు



ఆర్తాం-గదబవలస పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: కొమరాడ మండలంలోని నాగావళి ఆవలవైపు ఉన్న ఎనిమిది గజరాజుల గుంపు గురువారం ఆర్తాం-గదబవలస గ్రామ పరిసరాల్లోకి చేరాయని, ప్రజలు అప్రమంతా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి జీపీసీ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఏనుగుల గుంపు రైల్వేపట్టాలు దాటే అవకాశం ఉందని, గుమడ నుంచి ఆర్తాం రైల్వే లైన్ మధ్య రైళ్ల రాకపోకలను పరిశీలించాలని సిబ్బందికి సూచించారు.

కౌలు రైతుకు సాగు హక్కు



- 11 నెలల పాటు సాగు హక్కు కలిగేలా (సీసీఆర్‌సీ) ధ్రువీకరణ పత్రాలు
- వాటి ఆధారంగా రుణాలు మంజూరు, ఇతర రాయితీల వర్తింపు
- 2021–2023 మధ్య కాలంలో 7,583 మందికి లబ్ధి
- 2023–24లో జిల్లాలో 5,125 మందికి కార్డుల జారీకి చర్యలు
- ఇప్పటికే 1,110 మందికి హక్కు పత్రాలు
- భూ యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా ప్రత్యేక చట్టం
- కౌలు రైతుల్లో హర్షం



కౌలు రైతులకు, భూ యజమానులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్:

కౌలు రైతులకు వైఎస్సార్‌సీపీ సర్కారు అండగా నిలుస్తోంది. విపత్తుల వేళ ఆదుకునేందుకు సాగు హక్కు పత్రాలను (సీసీఆర్‌సీ) జారీ చేస్తోంది. భూ యజమానికి ఎలాంటి నష్టం జరగకుండా 11 నెలల కాలపరిమితికి కౌలు రైతులకు సాగుహక్కు పత్రాలను అందజేస్తోంది. బ్యాంకు రుణాలు, నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీపై విత్తనాలు, ఎరువులు పొందేందుకు కౌలు రైతులకు వెసులుబాటు కల్పిస్తోంది. గత ప్రభుత్వాల నిర్వాకంతో పంట నష్ట పరిహారం, బ్యాంకుల నుంచి రుణ సహకారం, వ్యవసాయ పెట్టుబడి నిధులు అందక కౌలు రైతులు ఇబ్బంది పడేవారు. ఆ సమస్యలను పరిష్కరించేలా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో పంటల సాగుదారు హక్కు చట్టాన్ని అందుబాటులోకి తెచ్చింది. నాలుగేళ్లగా ఏటా ఏప్రిల్ నుంచి ఆర్‌బీకేల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులకు సీసీఆర్‌సీ (క్రాప్ కల్టివేటర్ రైట్స్) కార్డులు మంజూరు చేస్తోంది. సాగులో అండగా నిలుస్తోంది. నిరంతర ప్రక్రియగా ఉన్న సీసీఆర్‌సీ కార్డుల మంజూరు ప్రక్రియను కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..
సీసీఆర్‌సీ కార్డులు 11 నెలల కాలపరిమితిని కలిగి ఉంటాయి. ఈ పత్రాలను పొందిన (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ) కౌలు రైతులు ప్రభుత్వం స్తున్న అన్ని రకాల ప్రయోజనాలు పొందవచ్చు. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టం ఏర్పడితే అందుకు తగ్గ ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. బ్యాంకుల నుంచి రుణం తీసుకునే అవకాశం ఉంటుంది. ఉచిత పంట బీమా, వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాలు, కనీస మద్దతు ధర, సర్కారు అందిస్తున్న రాయితీ విత్తనాలు పొందడంతోపాటు వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం పొందవచ్చు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2021 నుంచి 2023 సంవత్సరాల మధ్య 7,583 మంది కౌలు రైతులు పెట్టుబడిసాయం (రైతు భరోసా) పొందారు.

ఇరు వర్గాలకు ప్రయోజనం
భూ యజమానులు ముందుగా పంట రుణం పొంది ఉంటే ఆ భూమిని రైతు కౌలుకు తీసుకుంటే ఒకే భూమిపై రెండు రుణాలు వచ్చే అవకాశం లేదు. దీనిని అధిగమించేందుకు సీసీఆర్‌సీ కార్డులు పొందిన 5 నుంచి 10 మంది కౌలురైతులను ఓ గ్రూప్‌గా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేస్తుంది. దీనినే జాయింట్ లయబులిటీ (జేఎల్) గ్రూప్ అంటారు. ఈ గ్రూప్‌ల వివరాలను వ్యవసాయాధికారులు సంబంధిత బ్యాంకులకు అందించడం ద్వారా ఈ గ్రూప్ సభ్యులు కూడా రుణం పొందవచ్చు. అలాగే, వ్యక్తిగతంగా గుర్తింపు కార్డులను అందించడం జరుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...
జిల్లాలోని నాలుగు నియోజకవర్గల్లో గల 15 మండలాల్లో 306 రైతు భరోసా కేంద్రాల ద్వారా గడిచిన నాలుగేళ్ల కాలంలో 7,583 మందికి సీసీఆర్‌సీ కార్డులను అధికారులు అందజేశారు. వీరు ప్రభుత్వ సహాయాన్ని పొందుతున్నారు. ఈ ఏడాదిలో ప్రతి సచివాయలం పరిధిలో గల రైతు భరోసా కేంద్రాల్లో 175 మంది వరకు అర్హులను గుర్తించేలా యంత్రాంగం లక్ష్యాలను నిర్దేశించింది. ఇందులో భాగంగా ఆర్‌బీకేల పరిధిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గ్రామ సభలు చేపట్టి భూయజమానులను, కౌలు రైతులను సమన్వయం చేస్తున్నారు. ఈ ఏడాదిలో జిల్లాలో 5,125 మంది కౌలు రైతులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా పరిధిలో ఇప్పటికే 1,110 మంది సాగు హక్కు పత్రాలను పొందడం విశేషం.

కౌలు గుర్తింపు కార్డులు పొందాలంటే...
- భూమి సొంత రైతు పాస్ బుక్, 1–బి జిరాక్సు
- భూ హక్కుదారుని ఆధార్ కార్డు జిరాక్సు
- కౌలు రైతు ఆధార్ కార్డు జిరాక్సు
- కౌలు రైతు పాస్‌ఫొటోలు–3
- కౌలు కార్డు దరఖాస్తుకు జతచేసి ఆర్‌బీకేలలో అందించాలి.


జిల్లా : పార్వతీపురం మన్యం
మండలం :
VEERAGHATTAM
Kathulakaviti
SATHYANARAYANA S/o Chinnamnaidu
1-181,KATHULAKAVITI,VEERAGHATTAM,SRIKAKULAM
(20/06/2023)
(20/05/2024) వరకు 11 నెలలు కాలపరిమితితో
ఆధార్ నెంబర్ : 756482814604
మొబైల్ నెంబర్ : 8008533290
లింగం : Male
కులం : BC

ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న సీసీఆర్‌సీ కార్డు నమూనా

పంట రుణాలకు ప్రాధాన్యం



రైతులకు అండగా నిలిచేందుకు డీసీసీబీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. సాధారణ, గుర్తింపు పొందిన కౌలు రైతులకు రుణాలు మంజూరుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2021–22లో రూ.600 కోట్లు, 2022–23లో రూ.800 కోట్ల మేర పంట రుణాలు అందించాం. ఈ ఏడాది అర్హతగల ప్రతీ రైతుకు రుణం మంజూరు చేయాలని డీసీసీబీ పాలకవర్గాలు నిర్ణయం తీసుకున్నాయి. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర రుణ లక్ష్యాలను నిర్దేశించాయి. సాధారణ, వ్యక్తిగత కౌలు రైతులతోపాటు జేఎల్ గ్రూపు సభ్యులకు రుణసౌకర్యం కల్పిస్తాం. ఇప్పటివరకు 6వేల మంది రైతులకు రూ.50 కోట్ల వరకు రుణాలు మంజూరు చేశాం.
– డి.వరప్రసాద్, డీసీసీబీ, ఉమ్మడి జిల్లా సీఈఓ

నిరంతర ప్రక్రియగా..



కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందించే ప్రక్రియ ప్రభుత్వ సూచనల మేరకు నిరంతరాయంగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాల పరిధిలోని ప్రతి గ్రామంలో భూయజమానులు, కౌలు రైతులతో అవగాహన సభలు నిర్వహిస్తున్నాం. తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానికంగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారుల సహకారంతో లక్ష్యాలను చేరుకుంటున్నాం. అర్హతగల కౌలు రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా సీసీఆర్‌సీ కార్డులు పొందాలి. ప్రభుత్వం సమకూరుస్తున్న సంక్షేమ ఫలాలు సద్వినియోపర్చుకోవాలి.
– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

రెండేళ్లుగా రైతు భరోసా..



కౌలు రైతు గుర్తింపు కార్డు రెండేళ్ల కిందట పొందాను. అప్పటి నుంచి వ్యవసాయ పెట్టుబడులకు రైతు భరోసా వర్తిస్తుంది. తాజాగా ధాన్యం అమ్మకం నా పేరిట జరిగింది. ఎకరా పొలంలో కాయగూరలు, వరి సేద్యం చేసేందుకు అవకాశం లభించి. గతంలో ఈ తరహా సహకారం లేక కౌలు రైతులు ఇబ్బందులు పడేవారు. జగనన్న ప్రభుత్వంలో ఆర్‌బీకే అధికారులు దగ్గరుండి కౌలు రైతులకు గుర్తింపు కార్డు అందించడం ఆనందంగా ఉంది. మా పంచాయతీలో నితరంతరం వ్యవసాయ సభలు నిర్వహిస్తూ, సాగు సూచనలు ఇస్తూ రైతుకు అండగా నిలుస్తుండడం హర్షణీయం.
– వంగపండు అప్పారావు, కౌలురైతు, గరుగుబిల్లి గ్రామం, పాలకొండ మండలం

సమృద్ధిగా వరి విత్తనాలు

- రాబర్ట్ పాల్, జిల్లా వ్యవసాయ అధికారి



ఎల్విన్‌పేట ఆర్బీకేలో వరి విత్తనాలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట రైతు భరోసా కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఆర్బీకేలో ఉన్న విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని రైతులకు 25వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 22 వేల క్వింటాళ్లను ఆర్బీకేలకు సరఫరా చేశామన్నారు. గిరిజన రైతులకు 90 శాతం రాయితీపైన, గిరిజనేతరులకు కిలోకు రూ.10 చొప్పున రాయితీపై విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. కందులు 32 క్వింటాళ్లు, రాగు లు 87 క్వింటాళ్లు, వేరుశనగ 50 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, గిరిజన రైతులకు శాతశాతం రాయితీపై అందజేస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో 6వేల ఎకరాల్లో చిరుధాన్యాల పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం పంటల సాగు విస్తీర్ణం 3.20 లక్షల ఎకరాలుగా పేర్కొన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో ని రైతు గ్రూపులకు 143 యూనిట్లను 40 శాతం రాయితీపై అందజేశామన్నారు. ఆయన వెంట ఏఓ సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: గ్రామ/వార్డు సచివాలయాల్లో ప్రజలకు కావలసిన అన్ని ప్రభుత్వ సేవలు అందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. పార్వతీపురం మండలం చినబొండపల్లి సచివాలయాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిని సచివాలయ సిబ్బంది సందర్శించాలని, ప్రజల అవసరాలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలన్నారు. సచివాలయంలో రికార్డుల నిర్వహణ, బయోమెట్రిక్ పరికరాల పనితీరును పరిశీలించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీతంపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మెరుగైన వైద్యసేవలు అందజేయాలని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఐటీడీఏలో వైద్య సిబ్బందితో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మలేరియా, డెంగీ వ్యాధుల వ్యాప్తిని ముందస్తు జాగ్రత్తలతో కట్టడి చేయాలన్నారు. దోమలనివారణా మందును ఊరూరా పిచికారీ చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి పాల్గొన్నారు.

గెడ్డలుప్పి పరిసరాల్లో చిరుతపులి

- భయాందోళనలో ప్రజలు
- అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ అధికారులు



చిరుతపులి సంచారంపై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న అటవీశాఖ అధికారులు

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామ కళ్లాల్లో గురువారం మధ్యాహ్నం చిరుతపులి సంచరిస్తోందన్న సమాచారంతో గ్రామస్తులు భయాందోళ చెందుతున్నారు. గ్రామానికి చుట్టం చూపుగా వచ్చిన వ్యక్తి కళ్లంవైపు వెళ్తుండగా పులి కనిపించడంతో పరుగున వచ్చి గ్రామస్తులకు తెలియజేశాడు. వెంటనే సర్పంచ్ తిరుపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి మోహనరావు జిల్లా కేంద్రంలో ఉన్న అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అటవీశాఖ అధికారి త్రినాథరావు సిబ్బందితో కలిసి గెడ్డలుప్పి గ్రామంలో పులిసంచరిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్రలను బట్టి చిరుతపులి అయి ఉండవచ్చన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రుణాల రికవరీపై శ్రద్ధ

- డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



గుమ్మలక్ష్మీపురం వైఎస్సార్ క్రాంతి పథంలో సూచనలు చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా సంఘాల సభ్యులకు ఉన్నతి, స్త్రీనిధి, సీఐఎఫ్ వంటి పథకాల కింద మంజూరు చేసిన రుణాల రికవరీపై ప్రత్యేక శద్ధ చూపాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గుమ్మలక్ష్మీపురం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద సీసీలు, వీఓఏలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల ప్రగతి, రికవరీలను క్లస్టర్లవారీగా అగిడి తెలుసుకున్నారు. వైఎస్సార్ ఆసరా, చేదోడు ద్వారా ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు అందజేసిన ఆర్థిక సాయంతో జీవనోపాధులు మెరుగుపర్చుకునేలా సభ్యులను ప్రోత్సహించాలన్నారు. చిన్నచిన్న సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతిష్టాతకంగా అమలు చేయనున్న మహిళా మార్ట్ ఏర్పాటు కోసం డ్వాక్రా మహిళల వాటాధనం చెల్లించి సభ్యత్వ నమోదులు త్వరితగతిన చేపట్టాలన్నారు. సమావేశంలో డీపీఎం ఎల్.హెచ్ ప్రవీణ్ కుమార్, ఏపీఎం ఎం.ఆదయ్య, సీసీలు పాల్గొన్నారు.

యువజనోత్సాహం



- ఉల్లాసంగా యువజనోత్సవాలు
- ఆటపాటలతో అలరించిన యువతీయువకులు
- విజేతలను రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు ఎంపిక
- జిల్లాకు పేరు తేవాలి: ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: థింసా నృత్యాలు.. ఆలోచింపజేసే రచనలు.. మనసును హత్తుకునే కవితలు.. జానపద కళా ప్రదర్శనలు.. మంత్రముగ్ధులను చేసే చిత్రలేఖనాలు.. ఆకట్టుకునే ఉపన్యాసాలతో మన్యం యువతీయువకులు మురిపించారు. చూపరులను మైమరిపించారు. పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా గురువారం నిర్వహించిన యువజనోత్సవాల్లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. కేరింతలు కొట్టారు. 'యువ ఉత్సవ్-2047' థీమ్‌తో జిల్లా నెహ్రూ యువకేంద్రం, శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు సాగాయి. సృజనాత్మక రచన, కవిత్వం, చిత్ర లేఖనం, జానపద, సాంస్కృతిక నృత్యాలు, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం వంటి పోటీల్లో యువత తమదైన ప్రతిభ చూపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. యువతలో దాగివున్న ప్రతిభాపాటవాలను వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం యువజనోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని బంగారు భవితకు బాటలు వేసుకోవాని సూచించారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్ మాట్లాడుతూ యువత పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. సాధనతో ప్రతిభకు పదునుపెట్టాలన్నారు. స్త్రీ, పురుషులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా హిమబిందు, గాయత్రి, రవి వ్యవహరించారు. విజేతలకు జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్‌లు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ముందుగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గేణేశ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డా.చింతల చలపతిరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవి కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్

విజేతలు వీరే...
సృజనాత్మక రచన: పి.పుణ్యవతి, జి.గౌతమి, పి.సౌమ్య
చిత్రలేఖనం: టి.పవిత్ర, ఎస్.గౌరీశంకర్‌రావు, మహేష్
మొబైల్ ఫొటోగ్రఫీ: ఎస్.సంతోష్‌కుమార్, బి.వంశీ, ఎస్.గణపతి
సాంస్కృతిక జానపద కళలు: రాజారత్నం నాట్య మండలి, రాధా కృష్ణబృందం, థింసా గ్రూప్



తప్పెటగుళ్లు కళాకారుల నృత్య విన్యాసం

క్లుప్తంగా

హాట్ మిక్స్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న కొత్తవలస ఫైర్ సిబ్బంది

కొత్తవలస: విశాఖపట్నం–రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి మండలంలోని గులివిందాడ గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన హాట్‌మిక్స్ ప్లాంట్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో కొత్తవలస ఫైర్ సిబ్బందికి ప్లాంట్ నిర్వాహకులు సమాచారం అందజేశారు. ఈ మేరకు అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు.ఈ ప్రమాదంలో సుమారు రూ.4లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా వేశారు. హాట్‌మిక్స్ ప్లాంట్‌లో కనీసం ఫైర్‌సేఫ్టీని అనుసరించ లేదని ఫైర్ అధికారి అశోక్‌కుమార్ ఈ సందర్భంగా అసహనం వెలిబుచ్చారు. ఇప్పటికైనా సేఫ్టీని పాటించాలని సూచించారు.

మద్యం సీసాల పట్టివేత

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కొత్తవలస సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో 25 మద్యం సీసాలు పట్టుబడి నట్లు ఎస్సై నరేంద్ర కుమార్ తెలిపారు. అనధికార మద్యం విక్రయాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సీహెచ్.రాజేశ్వరి ఆదేశాలతో నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన దువ్వాడ శివ వద్ద 25 మద్యం సీసాలు పట్టుబడినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఈ దాడుల్లో హెచ్‌సీ అప్పారావు, కానిస్టేబుల్స్ సంతోష్‌కుమార్, విజిలెన్స్ వింగ్ హెచ్‌సీ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గరుగుబిల్లిలో మరో 89 మద్యం సీసాలు..

గరుగుబిల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ఎం.రాజేష్ గురువారం తెలిపారు. మండలంలోని ఎస్ఆర్‌పేటలో గ్రామానికి చెందిన గుడ్ల మన్మధరావు అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడని 89 క్వార్టర్ బాటిల్స్, 16 బీరు బాటిల్స్ కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బొబ్బిలిలో 240 మద్యం సీసాలు..

బొబ్బిలి: పట్టణంలోని దిబ్బవీధికి చెందిన వేగి సూరిబాబు 240 మద్యం సీసాలు తరలిస్తుండగా గొల్లపల్లి పైల వీధి జంక్షన్ తన సిబ్బందితో పహారా కాస్తున్న ఎస్సై వి.జ్ఞాన ప్రసాద్ పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు, తరలిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్టు ఎస్సై ఈ సందర్భంగా విలేకరులకు తెలిపారు.

2400 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

సీతంపేట: మండలంలోని దోనుబాయి గ్రామం నుంచి కొత్తూరు వైపు అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 2,400 కిలోల పౌరసరఫరాల శాఖకు చెందిన బియ్యం బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. మొత్తం 48 బ్యాగ్‌లలో ఇద్దరు వ్యక్తులు బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నామన్నారు. బియ్యాన్ని సివిల్ సప్లేస్ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పశువులు రవాణా చేస్తున్న వ్యాన్ సీజ్

సీతంపేట: మండలంలోని సోమగండి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పశువులు అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. బలద సంత నుంచి రాజాం పట్టణానికి తరలిస్తుండగా మొత్తం 8 పశువులను పట్టుకుని గోశాలకు తరలించామని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,450–00
బంగారం(22కి. 10గ్రా.)	54,500–00
వెండి (కిలో)	75,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పెళ్లి వద్దు.. చదువే ముద్దు

- బాల్యవివాహాల నిరోధానికి పటిష్ట చర్యలు
- అడ్డుకట్ట వేసేందుకు ఎక్కువ మంది అధికారులకు బాధ్యతలు
- పకడ్బందీగా చట్టం అమలుకు నిర్ణయం



బాల్యవివాహాల నిషేధ చట్టం వాల్‌పోస్టర్

విజయనగరం ఫోర్ట్: రాజారామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తల కృషి ఫలితంగా బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అయినా మారుమూల గ్రామాల్లో అక్కడక్కడా బాల్య వివాహాలు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. బాల్య వివాహం బాలికల జీవితాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వారి భవిష్యత్తు అవకాశాలను కోల్పోయేలా చేస్తుందని వైద్యులు, మేధావులు, చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ ఆటపాటలతో ఆనందంగా గడవాల్సిన బాల్యం మూడుముళ్ల బంధంలో చిక్కుకుంటోంది. పుస్తకాలు మోయాల్సిన వయస్సులో పుస్తెల తాడు మోస్తున్నారు. వివాహంఅంటే ఏమిటో తెలియకపోయినా పెద్దలు చెప్పారని తలవంచి తాళి కట్టించుకుంటున్నారు. పేదరికమో, పోషణ కష్టమో కానీ చిరు ప్రాయంలో అమ్మాయిలకు పెళ్లి చేయాలని పెద్దలు భావించి చేస్తున్నారు. స్నేహితులతో కబుర్లు చెప్పుకోవాల్సిన వయస్సులో కుటుంబభారాన్ని బాలికలు మోస్తున్నారు. ఆడుకోవాల్సిన వయస్సులో పిల్లలను ఆడిస్తున్నారు. చిరు ప్రాయంలో తల్లులు కావడం వల్ల అనేక అనారోగ్య సమస్యల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. ఈ నే పథ్యంలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసి బాలికలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బాల్య వివాహ నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించింది. నిరోధానికి చర్యలు బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నందున వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటి నిరోధానికి గతంలో ఉన్న అధికారుల కంటే మరింత మందిని నియమించింది. బాల్య వివాహ నిరోధక చట్టం 2006కు సంబంధించిన జీఓ నంబర్ 13ను 2012లో మార్చి 19వ తేదీన ప్రభుత్వం జారీ చేసింది. వివాహాల నిరోధానికి జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలు ఉన్నాయి. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయి లో చైర్మన్‌గా ఆర్‌డీఓ, రెండు, మండలాలకు చైర్మన్‌గా సీడీపీఓ వ్యవహరిస్తారు. మండలస్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మున్సిపాలిటీల్లో కమిషనర్ బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు, సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక పాఠశాల హెచ్‌ఎం, స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఒకరు, పంచాయతీ వార్డు మెంబర్ ఒకరు, ఏఎన్‌ఎం, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, యువజన సంఘం ప్రతినిధి, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, మహిళా సంరక్షక్ పోలీస్ సభ్యులుగా వ్యవహరిస్తారు.

2012 నుంచి నిలుపుదల చేసిన బాల్య వివాహాలు	
సంవత్సరం	వివాహాల సంఖ్య
2012	33
2013	68
2014	52
2015	71
2016	69
2017	75
2018	85
2019	86
2020	90
2021	113
2022	49
2023	73

వివాహ వయసు వచ్చే వరకు పర్యవేక్షణ

బాల్య వివాహాలు నిలుపుదల చేస్తున్నప్పుడు వివాహం నిలుపుదల చేస్తున్నామని తల్లిదండ్రులు/సంరక్షకుల నుంచి లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటున్నప్పటికీ కొద్ది రోజుల తర్వాత బాలికలకు గుట్టుగా వివాహం చేసేస్తున్నారు. ఇకపై వాటికి అడ్డుకట్ట వేసేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బాల్య వివాహం నిలుపుదల చేసిన తర్వాత సంబంధిత బాలికకు చట్టరీత్యా వివాహ వయస్సు వచ్చేంతవరకు నిరంతరం పర్యవేక్షించే బాధ్యతను మహిళా సంరక్షక్ పోలీస్‌కు అప్పగించారు.



బాల్యవివాహ నిలిపివేయాలని కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

ఈ ఏడాది 73 బాల్య వివాహాల నిలుపుదల

2024 జనవరి నెల నుంచి ఇప్పటి వరకు బాలల సంరక్షణ అధికారులు, పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది 73 బాల్య వివాహాలను నిలుపుదల చేశారు.

వయస్సు వచ్చేంతవరకు పర్యవేక్షణ

> బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. వివాహాలను నిలుపుదల చేసినప్పటికీ బాలికకు వివాహ వయసు వచ్చేవరకు పర్యవేక్షణ చేయనున్నారు. దీనివల్ల బాల్య వివాహా లను పూర్తిస్థాయిలో నిరోధించడానికి అవకాశం ఉంటుంది.
>
> అల్లు సత్యనారాయణ,
> బాలల సంరక్షణ జిల్లా అధికారి

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కురుపాం: కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జన్మదినం సందర్భంగా గురువారం కురుపాం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చినమేరంగి గ్రామానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు ఆమెకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, ఎంపీటీసీలు విద్యారాణి, బంగారునాయుడు, సంతోషిరాణి గౌడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరావు, స్టేట్‌ఫైనాన్స్, కళింగ వైశ్య, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనిమి ఇందిరాకుమారి, కొత్తకోట సురేష్, జి. విజయ్, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

సివిల్స్ ర్యాంకర్‌కు జెడ్పీ చైర్మన్ అభినందన

విజయనగరం: జాతీయ పోటీ పరీక్ష సివిల్స్‌లో 607వ ర్యాంక్ సాధించిన బవిరి సంతోష్‌కుమార్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. రేగిడి మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ కార్యాలయంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశాడు. 2020 నోటిఫికేషన్‌లో సివిల్స్ పరీక్షలకు హాజరు కాగా 2021లో విడుదలైన ఫలితాల్లో ర్యాంక్ సాధించి పోస్టల్ సర్వీస్‌లో ఉద్యోగం పొంది ఢిల్లీలో శిక్షన పొందుతున్నాడు. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో 2022 నోటిఫికేషన్‌లో మరోమారు పరీక్షకు హాజరై 607 ర్యాంక్ సాధించాడు. వరుసగా రెండుసార్లు సివిల్స్ పరీక్షలో ర్యాంక్ సాధించిన సంతోష్‌కుమార్‌ను జెడ్పీ చైర్మన్ అభినందించారు.



సివిల్స్ ర్యాంకర్ సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జాతీయ జూడో పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక

రామభద్రపురం: తిరుపతిలో ఈ నెల 17,18,19 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పాల్గొన్న జిల్లాలోని కొట్టక్కి ఉన్నత పాఠశాలకు చెందిన తూముల యశోద, పీఎస్ బొడ్డవలస సాంఘిక సంక్షేమపాఠశాలకు చెందిన జి.వరుణ్ బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్ గురువారం తెలిపారు. అలాగే కొట్టక్కికి చెందిన ముత్యాల వినీత సిల్వర్, సామిరెడ్డి సంధ్య బ్రాంజ్, సామిరెడ్డి రామలక్ష్మి బ్రాంజ్, కిర్ల రమ్య బ్రాంజ్, పెదమేడపల్లికి చెందిన కె శ్రావణి బ్రాంజ్, పీఎస్ బొడ్డవలసకు చెందిన జి.కల్యాణ్ రామ్ బ్రాంజ్ పతకాలు సాధించారని చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, కొట్టక్కి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



జూడో పోటీలలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి,హెచ్‌ఎం భాస్కరరావు

సెంచూరియన్‌లో ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఓపెన్ టోర్నమెంట్ పోటీలను వీసీ జీఎస్ఎన్ రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 73 జట్లు వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్ డబుల్స్ తదితర క్రీడల్లో తలపడనున్నాయన్నారు. ఫుట్‌బాల్, క్రికెట్ విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు నగదు, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు, ట్రోఫీలు అందజేస్తామన్నారు. లాన్ టెన్నిస్, వాలీబాల్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.2,500, ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



సెంచూరియన్ క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు

ఫ్లై ఓవర్‌పై బొగ్గు లారీ బోల్తా

- నిలిచిపోయిన ట్రాఫిక్

బొబ్బిలి: విశాఖ–రాయగడ అంతర్రాష్ట్ర రోడ్డులో రాయగడ వెళ్తున్న భారీ బొగ్గులారీ గురువారం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో దాదాపు గంటన్నరకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం మేరకు పట్టణ ఏఎస్సీ కొండలరావు, ట్రాఫిక్ ఎస్సై జి.పోలినాయుడులు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బొగ్గును పొక్లెయినర్‌తో పక్కకు తోడించారు. అలాగే క్రేన్‌ను తీసుకువచ్చి లారీని రోడ్డు పక్కగా తీయించి అటు ఐటీఐ కాలనీ, ఇటు వైపు జూట్‌మిల్లు వరకూ నిలిచిపోయిన వాహనాలకు దారి ఇచ్చారు.



లారీని క్రేన్ సహాయంతో తీస్తున్న దృశ్యం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సాలూరు: రామభద్రపురం మండలం ముచ్చర్లవలస గ్రామానికి చెందిన సువ్వాడ జగదీష్(18) విద్యుత్ షాక్‌తో సాలూరులో గురువారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయ. తన మేనమామ నడుపుతున్న సప్లయిర్స్, టెంట్ హౌస్‌లో పనులకు జగదీష్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని మరిపల్లి గ్రామంలో ఆదివారం జరగబోయే ఓ ఇంటి శుభకార్యానికి సబంధించి గురువారం స్టేజ్ వేస్తుండగా, ప్రమాదవశాత్తు అక్కడ పైన ఉన్న విద్యుత్ వైర్లు పెండాల్ రాడ్లకు తాకడతంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే సాలూరు ఏరియా ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి తల్లి వెంకటమ్మ, అన్నయ్య యుగంధర్ ఉన్నారు. మృతుని అన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



సాలూరు: జగదీష్ మృతదేహం

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు..



డెంకాడ: ప్రమాదంలో మరణించిన పట్టా ప్రసన్న

డెంకాడ: మండలంలోని దొడ్డిబాడువ గ్రామం వద్ద విజయనగరం–నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. విజయనగరం నుంచి నాతవలస వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం, నాతవలస నుంచి విజయనగరం వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాతవలస నుంచి విజయనగరం వైపు స్కూటీపై వస్తున్న పట్టా ప్రసన్న (28) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడిది భోగాపురం మండలంలోని మాలనందిగాం గ్రామం.

రైల్వేట్రాక్‌పై మృతదేహం

కొమరాడ: మండలంలోని కెమిశీల పంచాయతీ తులసిగ్రామానికి చెందిన నల్లా రవీంద్రచంద్రమౌళి(32) కూనేరు, గుమడ రైల్వే స్టేషన్ల మధ్య సరుగుడుగూడ జంక్షన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై విగత జీవిగా పడి ఉన్నాడు. దీన్ని గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు జీఆర్పీ సిబ్బందికి సమాచారం అందించారు సమాచారం తెలుసుకున్న జీఆర్‌పీ సిబ్బంది వచ్చి పరిశీలించి మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



రైల్వే ట్రాక్‌పై విగత జీవిగా పడి ఉన్న నల్లా రవీంద్ర చంద్రమౌళి

మృతిపై అనుమానలు

అయితే తన భర్త రవీంద్ర చంద్రమౌళి మృతిపై పలు అనుమానులు ఉన్నాయి అంటూ మృతుడి భార్య రాధ, సర్పంచ్ తాడింగి భీమయ్య విలేకరులకు చెప్పారు. మృతదేహంపై ఎక్కడా ఎలాంటి గాయాలు కన్పించడం లేదని ఎక్కడో హత్య చేసి తీసుకువచ్చి ట్రాక్‌పై పడివేసినట్లు ఉంది తప్ప రైల్వే ప్రమాదంలో మృతి చెందినట్లు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిపై పూర్తి దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న భార్య రాధ

బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం

- బీసీలకు అండగా నిలిచింది ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే
- ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మారేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్

విజయనగరం అర్బన్: రాజకీయంగా, సామాజికంగా వెనుకబడినన వర్గాల పట్ల చిన్నచూపు చూసే ఏ పార్టీకైనా తమ సత్తా చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేష్ స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా విజయనగరం పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక ప్రైవేట్ హాటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా నడపేన శ్రీనివాసరావు (జమ్ముశ్రీను)ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుధా కృష్ణను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు సీట్ల కేటాయించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో 75 ఏళ్లగా పాలిస్తున్న రాజకీయ పార్టీలు బీసీలను విస్మరించాయని ఆరోపించారు. దేశంలో 56 శాతం ఉన్న బీసీలకు రాజకీయ రంగంలో 14 శాతం, ఉద్యోగ రంగంలో 9 శాతం, పారిశ్రామిక రంగంలో ఒక శాతం, ప్రైవేట్ రంగం ఉద్యోగాలలో 5 శాతం ప్రాతినిధ్యం కూడా లేదన్నారు. బీసీ జనాభా లెక్కలు సేకరించాలని 40 సంవత్సరాలుగా సుప్రీం కోర్టు కేంద్రప్రభుత్వాలకు చెబుతున్నా బీసీ జనగనణ చేయకుండా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని ఒక నినాదంలా కాకుండా ఒక విధానంలా మార్చుకుని దేశంలోని మిగతారాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచి బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్నారని ప్రశంసించారు. సర్పంచ్ స్థాయి నుంచి రాజ్యసభ స్థానాల వరకు మంత్రివర్గంలోనూ పదవుల్లోనూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్‌లలో మొత్తం బీసీ సామాజిక వర్గానికి 65 శాతానికి పైగా రాజ్యాధికారంలో వాటా ఇచ్చిన వ్యక్తి ముఖమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు.

25 వేల మందితో విజయనగరంలో బీసీ గర్జన

కేంద్రప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యం పెంచాలనే డిమాండ్‌తో వచ్చే జూలై నెలలో విజయనగరం జిల్లా కేంద్రంలో దాదాపు 25 వేల మందితో బీసీ గర్జన నిర్వహిస్తామని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ ప్రకటించారు. జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆశీస్సులతో ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడతామని తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆశయాలకు అనుగుణంగా విజయనగరం జిల్లా కమిటీ బలోపేతానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు జమ్ముశ్రీను అన్నారు. త్వరలో అన్ని నియోజకవర్గ కమిటీలు, మండల కమిటీలు గ్రామస్థాయి కమిటీలు పూర్తి చేస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వేమూరి బేబీరాణి, ఉత్తరాంధ్ర బీసీ సంఘం ఇన్‌చార్జ్ గదుల సత్యలత, బీసీ సంఘం కన్వీనర్ బొద్దాన అప్పారావు, బీసీ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సుధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

- వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగించే పలుకోర్సులకు ఉచిత శిక్షణ తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వసతి గృహంలో నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి జీబీవీ రమణ తెలిపారు. కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, హౌస్ వైరింగ్ కోర్సులపై శిక్షణ ఉంటుందని చెప్పారు. వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత యువత మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 4వ తేదీ లోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 9959521662, 9985787820 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ నీలావతి

రాజాం సిటీ: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన అదృశ్యమైన(తప్పిపోయిన) శనపతి దమయంతి అనే బాలికను ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు గురువారం అప్పగించారు. ఏప్రిల్ 29వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు తండ్రి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖపట్నంలోని బంధువుల ఇంట్లో బాలిక ఉన్నట్లు గుర్తించి, ఆమెను తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు ఎస్ఐ నీలావతి అప్పగించారు.